## మాజీ మంత్రికి వివాహ ఆహ్వానం



నిజాంపేట, ఏప్రిల్ 19: మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావును చల్మెడ మాజీ ఎంపీటీసీ బాల్‌రెడ్డి సిద్దిపేటలోని తన కార్యాలయంలో శనివారం కలిశారు. అనంతరం తన కుమారుడు వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వాదించాలని కోరుతూ వివాహ ఆహ్వాన పత్రిక అందజేశారు.

## ఈతకు వెళ్లి యువకుడు మృతి



సంజయ్ (ఫైల్)

చేగుంట, ఏప్రిల్ 19: ఈతకు వెళ్లి యువకుడు మృతి చెందిన ఘటన చేగుంటలో జరిగింది. బాధిత కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చేగుంటకు చెందిన తిరుపతి సంజయ్ (లాలు)(21) రామాయంపేట మండలం దామరచెర్వులో జరుగుతున్న పెద్దమ్మ పండగకు బంధువులకు ఇంటికి వెళ్లాడు. కామారెడ్డి జిల్లా, భిక్కనూర్ మండలం పెద్ద మల్లారెడ్డి సమీపంలోని ఓ సిమ్మింగ్ పూల్‌లో శనివారం ఈత కోసం వెళ్లాడు. నీటిలోకి దిగడంతో ఫీట్స్ వచ్చి నీటిలో మునిగి మృతి చెందాడు. సంజయ్ మృతితో చేగుంటలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## చెరువులో పడి మహిళ మృతి



అమృత (ఫైల్)

రామాయంపేట, ఏప్రిల్ 19: చెరువులో పడి మహిళ మృతి చెందిన ఘటన రామాయంపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని గొల్పర్తిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బొగ్గుల అమృత (45) శుక్రవారం సాయంత్రం బట్టలు ఉతకడానికి గ్రామ శివారులోని పాండు చెరువుకు వెళ్లింది. బట్టలు ఉతుకుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారి చెరువులో పడిపోయింది. విషయం తెలుసుకున్న మృతురాలి బంధువులు చెరువులో రాత్రంతా గాలించారు. ఎక్కడ దొరకలేదు. శనివారం తెల్లవారుజామున చెరువులో మృతదేహం కనిపించింది. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు రామాయంపేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, భర్త ఉన్నారు.

## అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



గేమ్‌సింగ్ (ఫైల్)

కౌడిపల్లి, ఏప్రిల్ 19: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన కౌడిపల్లి పోలీస్‌స్టేషన్‌లోని శేరీతండాలో జరిగింది. ఎసై రంజిత్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన దుంగావత్ గేమ్‌సింగ్ (35) పదేండ్ల క్రితం బతుకు దెరువు కోసం గుమ్మడిదలకు వెళ్లి కూలి చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈనెల 18న చిట్టీ డబ్బులు కట్టేందుకు రూ.40 వేలు తీసుకుని తండాకు వచ్చాడు. దుంగావత్ మోహన్, సళావత్‌పూర్ జహీర్‌తో రాత్రి వరకు మద్యం తాగారు. అనంతరం ధర్మసాగర్ గేటు వద్ద గల దాబా హోటల్‌లో తింటుండగా ఒక్కసారిగా కిందపడిపోయాడు. వెంటనే అతన్ని 108లో కౌడిపల్లి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం మెదక్ ప్రభుత్వ దవాఖానకు తరలించగా అక్కడ పరీక్షించిన వైద్యులు గేమ్యా అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. గెమ్‌సింగ్ మృతిపై అతడి భార్య శాంతి అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. శాంతి ఫిర్యాదు మేరకు కేసు నామోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎసై తెలిపారు.

## కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

నర్సాపూర్, ఎప్రిల్ 19: కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నర్సాపూర్ పోలీస్ స్టేషన్ పరిదిలో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... రాంచంద్రపురం గ్రామానికి చెందిన సార సురేష్(37) తండ్రి ఆంజనేయులు సెంట్రింగ్ పనులు చేస్తూ జివనం సాగిస్తున్నాడు. కాగా సంసారం విషయమై భార్య మానసతో తరుచూ గొడవలు జరుగుతూ ఉండేవి. ఈ నేపథ్యంలో గతంలో ఓసారి కత్తితో పొడుచుకుని ఆత్మహత్యకు ప్రయత్నించగా వేంటనే ఆస్పత్రిలో చేర్పించి రక్షించారు. ఈ క్రమంలో మళ్ళీ గత శుక్రవారం తనకు వెయ్యి రూపాయలు కావాలని సురేష్ తన భార్య మానసను అడిగాడు. మానస ఇప్పుడు డబ్బులు లేవు తర్వాత ఇస్తానని చెప్పి నర్సాపూర్ మార్కెట్‌కు వెళ్ళింది. తర్వాత వచ్చి చూసే సరికి సురేష్ చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని భార్య పిర్యాదు మేరకు ఎస్ఐ లింగం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## గుర్తుతెలియని వాహనం ఢీ కొని వ్యక్తి మృతి

శివ్వంపేట, ఏప్రిల్ 19 : గుర్తుతెలియని వాహనం ఢీ కొని వ్యక్తి మృతి చెందిన ఘటన శివ్వంపేట మండలం చిన్నగొట్టిముక్ల శివారులోని చాకరిమెట్ల సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ చింతల్‌కు చెందిన గొల్ల లోకేశ్ (45)ను చాకరి మెట్ల సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీ కొనడంతో లోకేశ్ అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని అన్ని కోణాలలో దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

## పేకాడుతున్న ఎనిమిదిపై కేసు నమోదు



వివరాలను వెల్లడిస్తున్న ఎస్ఐ సుభాష్‌గౌడ్

మనోహరాబాద్, ఏప్రిల్ 19: పేకాడుతున్న ఎనిమిదిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుభాష్‌గౌడ్ తెలిపారు. నగరానికి చెందిన ఎనిమిది మంది మండలంలోని జీడిపల్లి శివారులో గల వింటర్ గ్రీన్ ఫాంహౌస్‌లో పేకాడుతున్నారన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో ఎనిమిది మందిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి, వారి వద్ద నుంచి 3 కార్లు, 8 సెల్‌ఫోన్లు, రూ.11,580 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

## పరిస్థితి విషమించి యువకుడి మృతి

చేగుంట, ఏప్రిల్ 19: దిచక్రవాహనంపై వెళ్తూ ఆడవి పందికి తగిలి తీవ్ర గాయాలై చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి యువకుడు మృతి చెందిన ఘటన చేగుంట పోలీస్‌స్టేషన్ పరిధిలోని పొలంపల్లి చౌరస్తా వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోనాలకొండపూర్‌కు చెందిన బోంది భాను(18) తుమ్మల కనుక రాజు దిచక్రవాహనంపై ఈనెల 17న మెదక్ మండలం రాజుపల్లి నుంచి వస్తున్న సమయంలో పొలంపల్లి శివారులోని బస్టాండ్ సమీపంలోని రహదారిపై నుంచి వెళ్తున్న అడవి పందిని ఢీకొన్నారు. దీంతో బైకు అదుపు తప్పి కింద పడింది. భాను తల, రెండు చేతులకు తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం గాంధీ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. మృతుడి సోదరి భవాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్

చిలిపిచెడ్, ఏప్రిల్ 19: మండలంలోని అజ్జమర్రిలో ఉపాధి కూలీలకు సరైన పనులు కలిపించకుండా, అధికారుల మాటను బేఖాతరు చేసిన ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ అతినారం శంకరయ్యను సస్పెండ్ చేసినట్లు ఎంపీడీవో ఆనంద్ తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు గ్రామాల్లో కూలీలకు సరైన ఉపాధి పనులు కల్పించాలన్నారు. ఎవ్వరైనా నిర్లక్ష్యం చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

# రజతోత్సవ సభను విజయవంతం చేయాలి



కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి





రామాయంపేట శివారులో గోడలపై వాల్‌రైటింగ్ రాస్తున్న బీఆర్ఎస్ నాయకులు



నర్సాపూర్‌లో వాల్ రైటింగ్ చేస్తున్న బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పంబల భిక్షపతి

- ప్రజలు బీఆర్ఎస్ పార్టీనే కోరుకుంటున్నారు
- నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 19: ఈనెల 27న వరంగల్ జిల్లాలో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పెద్దశంకరంపేట మండలం నుంచి భారీగా తరలిరావాలని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం పెద్దశంకరంపేటలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు వేల సంఖ్యలోతరలివెళ్లి కేసీఆర్ సభను విజయవంతం చేయాలన్నారు. సీఎంగా కేసీఆర్‌ను మళ్లీ కావాలని కోరుకుంటున్నారన్నారు. మండల పరిధిలోని లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన పలువురు కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలోకి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు సురేశగౌడ్, దత్తు, రమేష్, వెంకట్‌రెడ్డి, లింగయ్య, ప్రకాశ్, జంగం రాఘవులు, నర్సింహులు, ప్రకాశ్, తదితరులున్నారు.

### గోడలపై బీఆర్ఎస్ వాల్‌రైటింగ్

రామాయంపేట, ఏప్రిల్ 19: ఈనెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు భారీ ఎత్తున హాజరు కావాలంటూ ఆ పార్టీ నేతలు వాల్‌రైటింగ్ చేస్తున్నారు. రామాయంపేట శివారులోని గోడలపై వాల్‌రైటింగ్ రాస్తు సభను విజయవంతం చేయాలని పిలుపునిస్తున్నారు. వాల్ రైటింగ్‌లో చిట్టిమల్లి నరేందర్‌రెడ్డి, శ్రీకాంత్ సాగర్, నర్సింహులు, సాయి విజ్ఞాన్‌రెడ్డి, నాగరాజు, రమేశ్ ఉన్నారు.

### వరంగల్ సభను విజయవంతం చేయాలి

చిలిపిచెడ్, ఏప్రిల్ 19: ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మైనార్టీ సీనియర్ నాయకుడు ఖాసీం పిలుపునిచ్చారు. మండలంలోని బీఆర్ఎస్ మైనార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు.

### 27న గులాబీ దండు కదలిరావాలి

నర్సాపూర్, ఏప్రిల్ 19: బీఆర్ఎస్ రజతోత్సవ సభకు నర్సాపూర్ నుంచి గులాబీ దండు భారీగా కదలిరావాలని పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు పంబల భిక్షపతి పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని కోరుతూ పట్టణంలో వాల్ రైటింగ్ చేశారు.

### పాపన్నపేటలో..



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

పాపన్నపేట, ఏప్రిల్ 19: ఈ నెల 27న నిర్వహించనున్న రజతోత్సవ సభకు ప్రజలు అత్యధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పట్లూరి రాజు పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ సర్పంచులు నాగరాజు, రమేశ్, ప్రభాకర్, శ్రీను పాల్గొన్నారు.

# భూ భారతితో భూ ఆక్రమణలకు తావుండదు

- కలెక్టర్ రాహుల్‌రాజ్
- శివ్వంపేట, నర్సాపూర్‌లో భూభారతి చట్టంపై రైతులకు అవగాహన

శివ్వంపేట/నర్సాపూర్, ఏప్రిల్ 19: భూ భారతి చట్టంతో భూముల ఆక్రమణలకు తావుండదని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. శనివారం శివ్వంపేట, నర్సాపూర్‌లోని రైతు వేదికల్లో భూ భారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధరణిలో పరిష్కారం కాని కొన్ని భూ సమస్యలను ఆర్‌వోఆర్ చట్టం ద్వారా భూ భారతిలో పరిష్కరించుకోవచ్చన్నారు. చట్టంలోని ప్రాధాన్యత వివరాలను ప్రజలకు అర్థమయ్యే రీతిలో కరపత్రంపై ముద్రించి విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇక నుంచి భూములకు సంబంధించిన పహణీలను ఆన్‌లైన్‌నే కాకుండా హార్డ్‌కాపీలను రికార్డుల రూపంలో జాగ్రత్తగా భద్రపరుస్తామన్నారు. రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేసేందుకు ముందుగా భూముల సర్వే, మ్యాప్ తయారీ, గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణతో భూ భారతిలో భద్రత ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్‌రెడ్డి, తహసీల్దార్లు కమలాద్రి, శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్పర్సన్ సుహాసినిరెడ్డి, ఎంపీడీవోలు, ఏవోలు పాల్గొన్నారు.



శివ్వంపేటలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

### చిలిపిచెడ్‌లో..

చిలిపిచెడ్, ఏప్రిల్ 19: భూభారతి చట్టంపై మండలంలోని శీలాంపల్లి రైతు వేదికలో సోమవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ సింధూజ తెలిపారు. శీలాంపల్లి రైతు వేదికలో భూభారతి చట్టంపై నిర్వహిస్తున్న సదస్సుకు కలెక్టర్ రాహుల్‌రాజ్, నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. ఈ సదస్సులో మండలంలోని రైతులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఇన్‌చార్జి తహసీల్దార్ తెలిపారు.

### రేపు మల్లంపేటలో సదస్సు

పాపన్నపేట, ఏప్రిల్ 19: పాపన్నపేట మండలం మల్లంపేటలో సోమవారం భూభారతిపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సతీశ్ తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు రైతువేదిక వద్ద జరిగే కార్యక్రమానికి కలెక్టర్ రాహుల్ రాజ్ హాజరవుతారని పేర్కొన్నారు.

### కొల్చారంలో అవగాహన సదస్సు

కొల్చారం, ఏప్రిల్ 19: కొల్చారం రైతు వేదికలో భూ భారతిపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ గఫర్‌మియా ఒక ప్రకటనలో తెలిపారు.

## కొనుగోలు కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే



పెద్దశంకరంపేట, ఏప్రిల్ 19: కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని రామోజీపల్లి, పెద్దశంకరంపేట, చీలపల్లి గ్రామాల్లో పీఏసీఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో వీరోజిపల్లి, జూకల్, కొత్తపేట గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.

## కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన డీఆర్‌డీవో

నర్సాపూర్, ఏప్రిల్ 19: మండలంలోని రెడ్డిపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాస్‌రావు శనివారం పరిశీలించారు. అనంతరం ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ధాన్యాన్ని ఎఫ్‌ఏక్యూ ప్రకారంగా సిద్ధం చేసి కొనుగోలు కేంద్రంలో విక్రయించాలన్నారు. చివరి గింజ వరకు ప్రభుత్వం కొంటుందని వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ప్రకాశ్, ఏపీఎం గౌరీ శంకర్, సీసీ ప్రవీణ, సీఏ మహేశ్వరి పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాలు నివారించాలి: ఎస్పీ

మెదక్ అర్బన్, ఏప్రిల్ 19: రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత అని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మానవ తప్పిదాలు, నిర్లక్ష్యం, అజాగ్రత్తతోనే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. జాతీయ రహదారి వెంట ఉండే గ్రామాల ప్రజలు వ్యవసాయ పనులకు వెళ్లే వారు జాగ్రత్తగా వెళ్లాలని సూచించారు. ప్యాసింజర్ వాహనాలను అధిక లోడుతో నడపడం ప్రమాదకరమన్నారు.

## 'రన్ ఫర్ జీసస్' ర్యాలీ



రన్ ఫర్ జీసస్ ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవులు

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 19: మెదక్ సీఎస్ఐ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఉదయం రన్ ఫర్ జీసస్ ర్యాలీని నిర్వహించారు. చర్చి ప్రెసిబేటరీ ఇన్‌చార్జి శాంతయ్య ర్యాలీని ప్రారంభించారు. గుడ్‌ఫ్రైడే ప్రాముఖ్యతను తెలియజేశారు. చర్చి నుంచి ప్రారంభమై ర్యాలీ పట్టణంలో పురవీధుల గుండా కొనసాగి చర్చికి చేరుకున్నది. ర్యాలీలో సీఎస్ఐ కమిటీ సభ్యులు, సంఘ బాధ్యులు గంట సంపత్, సంశాన్ సందీప్, జాన్సన్, గెలెన్, సువన్‌డగ్లస్, వికాస్ పాస్టర్లు డేవిడ్, జైపాల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదాలపై నిర్లక్ష్యం చేయవద్దు



ప్రమాదాలపై సూచనలిస్తున్న సిబ్బంది

రామాయంపేట, ఏప్రిల్ 19: ప్రమాదాలు జరగడంతోనే వాటికి నివారణ చర్యలు చేపట్టాలని అగ్నిమాపక సిబ్బంది పేర్కొన్నారు. శనివారం వారోత్సవాల్లో భాగంగా పట్టణం లోని పలు వీధులతో పాటు ప్రధాన కూడళ్లలో పట్టణ వాసులకు ప్రమాదాలపై సూచనలు చేశారు. మహిళలు రోజూ వంటలు చేస్తుంటారని, ఆ సమయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు.

## మా భూములు మాకే దక్కాలని ఎంపీని నిలదీసిన రైతులు



మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు

రామాయంపేట, ఏప్రిల్ 19: కేంద్ర ప్రభుత్వం త్రీ డీ చట్టం ప్రకారం భూములను తీసుకుంటుందని, కచ్చితంగా మెదక్ ఎల్కతుర్తి రోడ్డు నిర్మాణం జరుగుతుందని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు పేర్కొన్నారు. శనివారం రామాయంపేటలోని భూ నిర్వాసితులతో జిల్లా అదనపు కలెక్టర్ నగేశ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు కచ్చితంగా ప్రభుత్వం నిర్మిస్తుందని, భూ నిర్వాసితులకు దక్కవని ఎంపీ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం త్రీడీ చట్టం తీసుకొచ్చిందని, ఆ చట్టం ప్రకారం భూములను వెనక్కి తీసుకోవడం కుదరదన్నారు. ఒక వేళ రోడ్డు నిర్మాణం కాకున్నా భూములు ప్రభుత్వ ఆధీనంలో ఉంటాయి తప్ప ఎవరికీ దక్కవన్నారు. సమావేశానికి విచ్చేసిన భూ నిర్వాసతులు మాత్రం మా భూముల కోసం ఎంత త్యాగానికైనా సిద్ధపడ్తామని అవసరమైతే ప్రాణ త్యాగాలకు కూడా వెనక్కిబోమని ఎంపీ ఎదుట తెగేసి చెప్పారు. తమ రామాయంపేటకు బైపాస్ వద్దని పట్టణంలో నుంచి రోడ్డు వెళ్లాలని కోరారు. రోడ్డు నిర్మాణం చేపడితే తాము ఊరుకోమని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో రమాదేవి, తహసీల్దార్ రజినీకుమారి ఉన్నారు.

# పెద్దచెరువుకట్ట రోడ్డుకు మరమ్మతులు



ఆర్థికసాయం అందజేస్తున్న మాజీ జడ్పీటీసీ

శివ్వంపేట, ఏప్రిల్ 19: ఎన్నో ఏండ్లుగా శివ్వంపేట పెద్ద చెరువు కట్ట రోడ్డు మరమ్మతులకు నోచుకోకపోవడంతో గుంతలమయంగా మారింది. పరిసర గ్రామాల ప్రజల విజ్ఞప్తితో స్పందించిన మాజీ జడ్పీటీసీ పబ్బమహేశ్ గుప్తా రూ.2లక్షల సొంత ఖర్చులతో రెండు కిలోమీటర్ల మెర డస్టు కంకరతో రోడ్డు పనులకు శనివారం ప్రారంభించారు. ఈ చెరువుకట్ట నుంచి 8 గ్రామాలకు వెళ్తారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రమణాగౌడ్, మాజీ వైస్ ఎంపీపీ రమాకాంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఉపసర్పంచ్ పద్మవెంకటేశ్, నాయకులు లక్ష్మీనర్సయ్య, నర్సింహారెడ్డి, గోవింద్‌నాయక్, బొగ్గుల యాదగిరి, పోచాగౌడ్, కొండల్, రామాగౌడ్ ఉన్నారు.

### ఐదు కుటుంబాలకు ఆర్థికసాయం

నవాబ్‌పేటలో ఐదుగురు బాధిత కుటుంబాలకు మాజీ జడ్పీటీసీ పబ్బమహేశ్‌గుప్తా ఆర్థికసాయం అందజేశారు. ఇటీవల మృతిచెందిన సాబేర ఉన్నీసాబేగం, నరాల సహదేవ్, మేకల పోచయ్య, రగోజి ప్రశాంత్ కుటుంబాలకు రూ.5వేల చొప్పున, రోడ్డు ప్రమాదంలో కాలు విరిగిన దుగూరు సత్యనారాయణకు రూ.5వేలు మొత్తం రూ. 25వేల నగదు బాధిత కుటుంబాలకు అందజేశారు. మాజీ సర్పంచ్ అశోక్‌రెడ్డి, నల్లరవిగౌడ్, నాయకులు ఇంద్రేశ్, చీల వెంకటేశ్, సరోజ, లక్ష్మయ్య, హరిగౌడ్, జనార్దన్‌గౌడ్, రామారం గోవర్దన్‌రెడ్డి ఉన్నారు.

# తల్లిదండ్రులు పిల్లలపై దృష్టి సారించాలి





మాట్లాడుతున్న ఎస్ఐ శివానందం, చైర్మన్ పీవీ

తూప్రాన్, ఏప్రిల్ 19: చిన్నతనం నుంచి పిల్లలపై తల్లిదండ్రులు దృష్టి సారించాలని ఎస్ఐ శివానందం అన్నారు. తూప్రాన్‌లోని లక్ష్మి గార్డెన్స్‌లో పల్లవి మోడల్ స్కూల్ వార్షికోత్సవ దినోత్సవాన్ని చైర్మన్ డాక్టర్ పీవీ రమణ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ.. టెక్నాలజీ మంచికి ఉపయోగపడితే, మరికొంత చెడు మార్గానికి దారి తీస్తుందన్నారు. దీని ప్రభావం ఎక్కువగా పిల్లలపై పడుతుందన్నారు. పిల్లలను ఫోన్లు, టీవీలకు దూరంగా ఉంచడంతో పాటు మంచి అలవాట్లను చిన్నతనం నుంచే నేర్పించాలన్నారు. విద్యార్థి దశ నుంచే పిల్లలను సరైన మార్గంలో పెంచితేనే భవిష్యత్‌లో ప్రయోజకులు అవుతారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు అశోక్, సందీప్ పాల్గొన్నారు.

## ఆరోగ్య లక్ష్మి భోజనాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మెదక్ రూరల్, ఏప్రిల్ 20: ఆరోగ్య లక్ష్మి భోజనాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ పీడీ హైమవతి అన్నారు. మండలంలోని శివాయపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ్ ప్రోగ్రామ్ నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే ఆరోగ్య లక్ష్మి భోజనం గర్భిణులు, బాలింతలు సద్వినియోగించుకోవాలన్నారు. 7 నెలల నుంచి 3 ఏండ్లలోపు పిల్లలకు బాలమృతం, 3 నుంచి 6 ఏండ్ల పిల్లల్లు ఫుడ్, గుడ్లు అందిస్తున్నట్లు తెలిపారు.

## మహనీయుల త్యాగాలను స్మరించుకోవాలి

నిజాంపేట, ఏప్రిల్ 19: బానిస బతుకుల విముక్తి కోసం అలుపెరగని పోరాటం చేసిన మహనీయుల త్యాగాలను గుర్తుపెట్టుకోవాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ అన్నారు. శనివారం నిజాంపేటలోని వంజర సంఘంలో నిర్వహించిన మహనీయుల జయంతోత్సవాల సభకు హాజరయ్యారు. బుద్ధుడు, అశోకుడు, జ్యోతిరావ్ పూలే, అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ దళిత, బహుజనుల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. కార్యక్రమంలో డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సంజీవ్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ ఉప సర్పంచ్ బాబు, మాల మహానాడు మండల ఉపాధ్యక్షుడు ఎల్లం, రాజగోపాల్, చంద్రం, స్వామి, రాజు, రామస్వామి ఉన్నారు.

## దుర్గమ్మ సేవలో జిల్లా జడ్జి లక్ష్మి శారద



పాపన్నపేట, ఏప్రిల్ 19: ఏడుపాయల వనదుర్గమ్మను ప్రిన్సిపల్ డిస్ట్రిక్ అండ్ సెషన్స్ జడ్జి లక్ష్మి శారద శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ సిబ్బంది,అర్చకులు ఆమెను ఘనంగాస్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆపై ఆలయ అధికారి ప్రతాప్‌రెడ్డి ఆమెను శాలువాతో సత్కరించారు. ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్,తగిన బందోబస్తు ఏర్పాటు చేశారు.

## నేటి నుంచి ఓపెన్ స్కూల్ పరీక్షలు

- జిల్లాలో పదో తరగతికి 459 మంది, ఇంటర్మీడియట్‌కు 875 మంది అభ్యర్థులు

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 19: నేటి నుంచి ఓపెన్ స్కూల్ పరీక్షలు ప్రారంభమై 26వ తేదీ వరకు కొనసాగనున్నాయి. జిల్లాలో పదో తరగతికి 459 మంది, ఇంటర్మీడియట్‌కు 875 మంది పరీక్షలు రాయనున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. పదో తరగతి కోసం మెదక్, నర్సాపూర్, తూప్రాన్‌లో ఒక్కొక్కటి చొప్పున పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇంటర్ కోసం మెదక్‌లో 2, నర్సాపూర్‌లో 2, తూప్రాన్‌లో ఒక కేంద్రాన్ని ఏర్పాటుచేశారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చిన్నశంకరంపేట, ఏప్రిల్19: బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ నాయకులు శనివారం ఆర్థిక సహాయాన్ని అందజేశారు.మండల పరిధిలోని రుద్రారం గ్రామానికి చెందిన క్యాసారం దాసు ప్రమాదవశాత్తు కరెంటు షాక్‌కు గురై మృతి చెందడంతో విషయాన్ని తెలుసుకున్న బీఆర్ఎస్ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంఠ తిరుపతి రెడ్డి సౌజన్యంతో బాదిత కుటుంబానికి రూ,5వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మణ్,బీఆర్ఎస్ నాయకులు రమణ, మధు, నరేశ్, రాజు, పోచయ్య, సంజీవ్, రమేశ్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

## డాక్యుమెంట్ రైటర్ల ఆందోళన



తూప్రాన్‌లో ఆందోళన చేస్తున్న డాక్యుమెంట్ రైటర్లు

తూప్రాన్, ఏప్రిల్ 19: రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ప్రభుత్వం కొత్త విధానాలు తీసుకురావడంతో తాము ఉపాధి కోల్పోయే పరిస్థితి నెలకొన్నదని డాక్యుమెంట్ రైటర్లు శనివారం ఆందోళనకు దిగారు. ప్రభుత్వం కొత్త విధానాన్ని ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ తూప్రాన్ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. దుకాణాలను మూసి వేసి నిరసన తెలిపారు.

## కంప్యూటర్‌ను బహూకరించిన పూర్వ విద్యార్థి




కంప్యూటర్‌ను బహూకరిస్తున్న దృశ్యం

నిజాంపేట, ఏప్రిల్ 19: రాంపూర్‌కు చెందిన శ్రీకాంత్‌గౌడ్ ఇటీవల ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సాధించాడు. ఈ మేరకు తాను చదువుకున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు తన తల్లిదండ్రులు లక్ష్మీ యాదగౌడ్ పేరిట కంప్యూటర్‌ను ఎంఈవో యాదగిరి ద్వారా పాఠశాలకు బహూకరించారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ మాజీ సభ్యుడు గౌస్, హెచ్ఎం పద్మారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

## వసతి గృహ అధికారి తొలగింపు

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 19: ఈ నెల 14న కౌడిపల్లిలోని ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్‌లో ఉన్న బాలికల వసతి గృహంలో అల్పాహారం తిని 30 మంది బాలికలు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. బాలికల అస్వస్థపై చేపట్టిన దర్యాప్తులో విధుల్లో నిర్లక్ష్యం వహించిన వసతి గృహ అధికారిని తొలిగించినట్లు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగిని వంట మనిషిని వేరే వసతి గృహానికి మార్చినట్లు పేర్కొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేసిన ఎమ్మెల్యే



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 19: సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే రోహిత్‌రావు శనివారం క్యాంప్ కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన కుట్టుమిషన్లను మహిళలకు అందజేశారు. పట్టణంలోని ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు.

### పలు ఆలయ కమిటీల అధ్యక్షులకు నోటీసులు

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 19:జిల్లా కేంద్రంలోని కొదండ రామాలయం, వెంకటేశ్వర దేవాలయ కమిటీ అధ్యక్షులకు మెదక్ డివిజన్ దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రంగరావు శనివారం నోటీసులు జారీ చేశారు. ఆలయాలకు సంబంధించి రికార్డులు, పూజ టికెట్లు, దుకాణ సముదాయ వివరాలు, కల్యాణ మండపం రుసుంలు, భక్తుల విరాళాలు, సిబ్బంది జీత భత్యాలతో పాటు మూడేండ్ల ఆదాయ వివరాలు తెలియజేయాలని నోటీసు లో పేర్కొన్నారు. లేకుంటే చట్టం ప్రకారం చర్య లు తీసుకుంటామన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

BRS T-SHIRTS

★వరంగల్ దగ్గర ఎల్కతుర్తిలో జరిగే BRS సభకు మీ నాయకుడి & మీ ఫోటోతో ఉన్న T-SHIRTS మీరు కోరిన విధంగా ప్రింట్ చేసి ఇస్తాము. 7416385350.
NT-325302-All

CHANGE OF NAME

★I, HINGOLEKAR KISHORE, S/o. Hingolekar Eshwar (New Name), previously called KALAL KISHORE, S/o. Eshwar Kalal (Old Name), R/o. H.No. 3-3-76, Arya Nagar, Zaheerabad, Sangareddy Dist., T.G. I have Changed My Name as HINGOLEKAR KISHORE, S/o. Hingolekar Eshwar for all purposes.
NT-Narsareddy

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.